క్లుప్తంగా

ఓటు సవరణల క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

ఎర్రగుంట్ల : ఈనెల 9, 10వ తేదీలలో మండలంలో ఓటు హక్కు నమోదు, సవరణల కోసం ప్రత్యేక క్యాంప్‌లను నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ యామని తెలిపారు. గురువారం ఎంపీడీఓ సభాభవనంలో బూత్‌స్థాయి అధికారులకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటరు జాబితా సరిచుసుకుని ఏమైనా సరవణలు చేసుకోవచ్చన్నారు. అలాగే 18వ సంవత్సరాలు నిండిన వారందరు కొత్త ఓటు హక్కు నమోదుకు తగు ఆదారాలను తీసుకుని దరఖాస్తులను సంబంధిత అధికారులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అర్జునరెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



మొలకెత్తని పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు గ్రామంలో సాగు చేసిన మినుము, బుడ్డశనగ పంటలను గురువారం కడప కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సునీల్, శ్రీవల్లిలు పరిశీలించారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడం వలన విత్తనం మొలక శాతం కాస్త ఆలస్యమైందన్నారు. రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని తెలిపారు. పల్లాకు తెలుగులు ఉధృతి ఎక్కువగా ఉందని ఇది తెల్లదోమ వలన ఈ వైరస్ వ్యాప్తి చెందుతుందని నివారణకు డైపెంతురాన్ 1.25గ్రాములు మరియు 19.19.19ను 10 గ్రాములు లీటరు నీటికి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి, మండల వ్యవసాయ అధ్కిరి శ్యామ్‌బాబు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆచార్య ఎన్‌జీ రంగా జయంతి



ఆచార్య ఎన్‌జీ రంగా చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న కళాశాల అసోసియేట్ డీన్

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఫుడ్‌అండ్ సైన్స్ కళాశాలలో గురువారం ఆచార్య ఎన్‌జీ రంగా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ మాధవ, అధ్యాపకులు, విద్యార్థులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌జీ రంగా రైతులు, కౌలుదారులు వ్యవసాయ కూలీలు, నిరుపేదల వారికోసం, ప్రతి రంగం వారి కోసం పనిచేశారన్నారు. వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేశారన్నారు.

కనీస వేతన జీఓను సవరించండి

ఎర్రగుంట్ల : పరిశ్రమలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపుదల చేయాలని ఏపీ విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో కలసి వినతిపత్రం అందించినట్లు సంఘం అధ్యక్షుడు వి.సుబ్బిరెడ్డి గురువారం తెలిపారు. ఐదేళ్లకు ఒక్కసారి కనీస వేతన జీఓ 11ను సవరించి నూతన జీవోను విడుదల చేయాల్సిందన్నారు. కానీ 8 ఏళ్ల దాటిన నేటికీ జీఓను సవరించలేదన్నారు. కనీస వేతనాలు పెరగక కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

మౌలానా ఆజాద్ నేటి యువతకు స్ఫూర్తి

కడప ఎడ్యుకేషన్ : స్వాతంత్ర్యం కోసం త్యాగం చేసిన గొప్ప నేత మౌలానా ఆజాద్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని మను పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మీర్జా విలయత్ పేర్కొన్నారు. మౌలానా ఆజాద్ జయంతి ఉత్సవాల సందర్భంగా కడప నగర శివారులోని మను పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ఆజాద్ డే వాక్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మిర్జా విలాయద్ ఆలీ బైగ్ మాట్లాడుతూ విద్యా రంగం అభివృద్ధికి మౌలానా ఆజాద్ చేసిన కృషి అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో హకీమ్ ఉద్దీన్, మహమ్మద్ సిఖందర్ హుస్సేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

గండికోట అభివృద్ధికి కృషి చేయాలని వినతి

కడప కల్చరల్ : పర్యాటక ప్రాంతం గండికోట అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ న్యూ ఢిల్లీ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. విజయవాడ సమీపంలోని సంస్థ కార్యాలయంలో కేంద్ర పురావస్తు శాఖ అమరావతి సర్కిల్ సూపరింటెండెంట్, ఆర్కియాలజిస్టు డాక్టర్ గోపినాథ్ జెననుకలిసి గురువారం వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆర్కియాలజీ పరంగా ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని కోరారు. రాష్ట్రంలోని చారిత్రక ప్రదేశాలను పరిరక్షించి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. కడపజిల్లాలో బౌద్ధ జైన ఆనవాళ్లు ఉన్నాయని, అడపూరు బౌద్ధారామాలను రక్షించాలని కోరారు.

రబీలో విస్తారంగా పంటల సాగు

- ఖరీఫ్‌లో పంటల్లేక రైతుల ఇబ్బందులు
- రబీలో వర్షాధారం కింద మినుము, శనగ సాగు
- సాగులో పెరిగిన పెట్టుబడులు
- రబీ దిగుబడులపై ఆశలు పెట్టుకున్న రైతులు



సాగులో ఉన్న మినుము పంట

వేముల : వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న రైతుల పరిస్థితి అగమ్యగోచరగా తయారైంది. వ్యవసాయం కలిసి రాక పంటల సాగులో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఒక సీజన్‌లో పంటలు పండినా మరో సీజన్‌లో పంటల్లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది రబీ సాగుకు సకాలంలో వర్షాలు కురిసి భూములు పదున్లు అయ్యాయి. దీంతో రైతులు వర్షాధారం కింద మినుము, శనగ పంటలను సాగు చేసుకున్నారు. అదునులో విత్తనం పడటంతో రైతులు ఎంతో ఆశతో ఉన్నారు. సాగుకు అప్పులు తెచ్చి పంటలు సాగు చేసుకున్నారు. రబీ సాగులో దిగుబడులు బాగా ఉంటాయనే ఆశతో రైతులు ఉన్నారు.

ఖరీఫ్ సీజన్‌లో పంటల్లేక ఇబ్బందులు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటల్లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. ఖరీఫ్‌లో వర్షాలు వస్తాయనే రైతులు పంటల సాగుకు సిద్ధం కాగా వర్షాభావం నెలకొనడంతో రైతులు పంటలు సాగు చేయలేదు. ఆలస్యంగా కురిసిన వర్షాలకు అక్కడక్కడ మినుము, వేరుశనగ, పత్తి పంటలను సాగు చేసుకున్నారు. సాగు అనంతరం వర్షాభావం నెలకొనడంతో పంటలు ఎండిపోయాయి. దీంతో రైతులు ఎండిన పంటలను దున్నివేశారు. పంటలసాగుకు పెట్టిన పెట్టుబడులు చేతికిరాక తీవ్రంగా నష్టపోయారు. పత్తి సాగులో అరకొర దిగుబడులు అందినా సాగుకు పెట్టిన ఖర్చులు కూడా రాలేదని రైతులు వాపోతున్నారు.

వర్షాధారం కింద మినుము, శనగ సాగు

ఈ ఏడాది రబీ సీజన్‌లో సకాలంలో వర్షాలు కురిశాయి. భూములు పదున్లు అయ్యాయి. దీంతో రైతులు వర్షాధారం కింద మినుము, శనగ పంటలను సాగు చేసుకున్నారు. మినుము సాగు చేసి నెల రోజులు, శనగ సాగు చేసి 20 రోజులు కావస్తోంది. ఇప్పటికే మినుము పంటలో రైతులు తెగుళ్లు సోకకుండా మందులు పిచికారి చేశారు. రబీ పంటలు అదునులో సాగు కావడంతో రైతులు రబీ పంటలపై ఆశలు పెట్టుకున్నారు. గత ఏడాది రబీలో పంటలు సాగులో దిగుబడులు ఆశాజనకంగా లేక రైతులు నష్టపోయారు. ఈ ఏడాది రబీనైనా గట్టెక్కిస్తుందనే ఆశ రైతులలో నెలకొంది.



వేముల వద్ద సాగు చేసిన శనగ పంట

సాగులో పెరిగిన పెట్టుబడులు

రబీ సాగులో పెట్టుబడులు పెరిగిపోయాయి. రబీలో మినుము, శనగ సాగు చేసుకున్న రైతులు ఎకరాకు రూ.15వేల మేర పెట్టుబడులు పెట్టారు. సాగులో దిగుబడులు వచ్చే సమయానికి మరో రూ.15వేల వరకు మందుల పిచికారి, కలుపు తీత, కోత కోసే పనులకు అదనంగా పెట్టుబడులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. సాగులో పెట్టుబడులు అవుతున్నా దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయనే ఆశ ఉందని రైతులలో వ్యక్తమవుతోంది.

రబీ సాగుపైనే రైతుల ఆశలన్నీ

ఈ ఏడాది రబీ సాగుపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. సకాలంలో వర్షాలు రావడం, అదునులో విత్తనం పడటంతో రైతులు ఆశతో ఉన్నారు. ఇప్పటి నుంచే రబీ పంటలపై ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సకాలంలో మందులు స్ప్రే చేసి తెగుళ్ల సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

9 ఎకరాలలో పంట సాగు చేశా



నాకున్న 9 ఎకరాలలో రబీలో పంటలు సాగు చేశా. ఇందులో 6 ఎకరాలలో మినుము, 3 ఎకరాలలో శనగ పంట సాగు చేశా. సాగుకు రూ.1.30 లక్షల మేర పెట్టుబడులు పెట్టా. దిగుబడులు వచ్చే సమయానికి మరో లక్షకుపైనే పెట్టుబడులు అవుతున్నాయి. సాగులో దిగుబడులు ఉంటాయనే ఆశతో ఉన్నాం.

– గంగిరెడ్డి, రైతు, గొందిపల్లె

దిగుబడులపై ఆశతో ఉన్నాం



రబీలో దిగుబడులు ఉంటాయనే ఆశతో ఉన్నాం. సకాలంలో వర్షాలు రావడంతో మినుము, శనగ పంటలు సాగు చేసుకున్నాం. సాగులో పెట్టుబడులు అవుతున్నా వెనుకాడలేదు. అదునులో విత్తనం వేయడంతో ఆశాజనకంగా దిగుబడులు ఉంటాయనే అనుకుంటున్నాం. రబీ అయినా కష్టాల నుంచి గట్టెక్కిస్తుందనే ఆశతో ఉన్నాం.

– శివశంకర్‌రెడ్డి, రైతు, పెద్దజూటూరు

రెగ్యులర్ ఎస్‌ఐగా తులసీ నాగప్రసాద్

సింహాద్రిపురం : మండల రెగ్యులర్ ఎస్‌ఐగా తులసీ నాగప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇన్‌చార్జి ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎస్‌ఎండీ షరీఫ్ తిరిగి కడప ఎస్‌ఐగా వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

11న జరిగే ధర్నాకు తరలిరండి



మాట్లాడుతున్న రామాంజనేయులు

కమలాపురం : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 11వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు తరలి రావాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా యూనియన్ నాయకుడు బల్లారపు రామాంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పెద్దదర్గా వద్ద జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారానే భవన నిర్మాణ కార్మికులకు పథకాలు అమలు చేయాలన్నారు. ఇసుక, నిర్మాణ రంగంలో ముడి సరుకుల అధిక ధరలను నియంత్రించాలన్నారు. భవన నిర్మాణంలో సెస్ రూపంలో వసూలు చేస్తున్న నిధులు, భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో ఓబయ్య, అశోక్, నివాస్, వెంకట సుబ్బమ్మ, మొన్నయ్య, మెనెమ్మ, శిరీష, వాసు,బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



రహదారులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ నారాయణ

పులివెందుల రూరల్ : వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని, వాహనాలను ఎక్కడపడితే అక్కడ అడ్డంగా ఉంచరాదని ఎస్‌ఐ నారాయణ తెలిపారు. గురువారం పట్టణంలోని ట్రాఫిక్ ప్రధాన రహదారులను ఆయన పరిశీలించారు. అలాగే దుకాణాలకు అడ్డంగా పెద్ద, పెద్ద ఫ్లెక్సీలను రోడ్డులో వచ్చే విధంగా ఉంచరాదని, దుకాణాలు ఏ విధంగా ఉంటే ఆ విధంగానే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుని దుకాణాల ముందు పెట్టుకోవాలన్నారు. ఫ్లెక్సీలను రోడ్డులోకి తీసుకురావద్దన్నారు. ముఖ్యంగా ప్రతి వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. లైసెన్స్ లేకపోతే జరిమానాలతోపాటు కేసు నమోదు చేస్తామన్నారు. వాహనాలకు సంబంధించిన పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలు పార్కింగ్ చేయాలన్నారు.

రేషన్ సరుకులన్నీ పంపిణీ చేయాలి



రేషన్ పంపిణీ చేసే వాహనం ఆపరేటర్లను ప్రశ్నిస్తున్న లబ్ధిదారుడు

కమలాపురం : ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా అందిస్తున్న రేషన్ సరుకులన్నీ లబ్ధిదారులందరికీ సక్రమంగా పంపిణీ చేయాలని లబ్ధిదారులు శివారెడ్డి తదితరులు కోరుతున్నారు. రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ఈనెల బియ్యంతో పాటు అరకిలో చక్కెర, కిలో కంది పప్పు, 1–3 కిలోల చొప్పున గోధమలు పంపిణీ చేసేందుకు అన్ని రకాల సరుకులు డీలర్లకు సరఫరా చేసింది. అయితే ఎండీయూ వాహనాల ఆపరేటర్లు బియ్యంతో పాటు ఏదో ఒక సరుకు మాత్రమే ఇస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. తనకు గోధుమలు కావాలని అడిగితే అయిపోయాయని, వాహనంలో లేవని ఆపరేటర్లు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. లేక పోతే డీలర్ దగ్గర ఉన్నాయని, వెళ్లి తీసుకోవాలని ఆపరేటర్లు చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బియ్యం ఒక చోట, గోధుమలు మరో చోట తీసుకోవాలా? అని ప్రశ్నిస్తున్నారు. రేషన్ సరుకుల పంపిణీపై రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించాలని, రెవెన్యూ అధికారుల తనిఖీలు లేక పోవడంతోనే ఎండీయూ వాహనాల ఆపరేటర్లు నిర్లక్ష్యంగా సరుకులు పంపిణీ చేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పనిచేసే చోటే ఉద్యోగులు నివాసముండాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ ఉద్యోగులంతా తాము పనిచేసే చోటే నివాసముండాలని రాలయసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి డీఆర్‌ఓను కలెక్టర్ కార్యాలయంలో ఆయన కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చాలా మంది ఉద్యోగులు తాము పనిచేసే చోటు నుంచి 30 నుంచి 50 కిలో మీటర్ల దూరంలో నివాసాలుంటున్నారని తెలిపారు. చాలామంది దూర ప్రాంతాల నుంచి విధులకు రావాల్సి ఉండడంతో సమయపాలన పాటించడంలేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహాసభలను విజయవంతం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

పులివెందుల టౌన్ : ఈనెల 16, 17, 18వ తేదీలలో కడప జిల్లాలో జరిగే ఏఐఎస్‌ఎఫ్ మహా సభలను విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్ర, సీపీఐ నియోజకవర్గ ఏరియా కార్యదర్శి వెంకట్రాములు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని స్థానిక శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో ఏఐఎస్‌ఎఫ్ మహా సభలకు సంబంధించిన కర పత్రాలను వారు విడుదల చేసి మాట్లాడారు. విద్యార్థులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈ మహాసభలను నిర్వహిస్తున్నామని.. ఈ సభలకు జిల్లాలోని విద్యార్థులందరూ హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న శివకేశవరెడ్డి

వేంపల్లె : స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలోని అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురువారం వేంపల్లెకు చెందిన బండ్లపల్లె పుల్లారెడ్డి 3వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు శివకేశవరెడ్డి అనాథ వృద్ధులకు అన్నదానంతోపాటు పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు.

అధైర్య పడవద్దు.. అండగా ఉంటా



జయశంకర్‌ను పరామర్శిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి

పెండ్లిమర్రి : కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు భయపడవద్దు పార్టీ, నేను ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటానని కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. గురువారం ఇటీవల పెండ్లిమర్రి ఎస్‌ఐ స్టేషన్‌కు పిలిపించి దాడి చేయడంతో గాయపడి విశ్రాంతి పొందుతున్న నందిమండలం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ముద్దనూరు జయశంకర్‌ను ఆయన పరామర్శించారు. పెండ్లిమర్రి ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేసి చిత్ర హింసలకు గురిచేస్తే అటువంటి వారిపై ప్రవేట్ కంప్లైట్ ద్వారా కేసులు వేయాలని సూచించారు. మరోక సారి పోలీసులు అనవసరంగా దాడి చేస్తే నాదృష్టికి తీసుకరండి స్టేషన్ వద్దనే పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామన్నారు. అవసరమైతే జిల్లా ఉన్నతాధికారులను కలిసి అటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని వివరిస్తామన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ రమణారెడ్డి, మాజీ ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలిశివ, వైఎస్సార్‌సీపీ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, వీరారెడ్డి, వెంకటశివారెడ్డి, రవి, సురేష్, నాగిరెడ్డి, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ గ్రామ సభలు



సంతకొవ్వూరులో రెవెన్యూ గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

తొండూరు : రైతు సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి తెలిపారు. గురువారం మండలంలోని సంతకొవ్వూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సర్వేలో జరిగిన లోపాలు ఉన్నట్లయితే రైతులు దరఖాస్తులు చేసుకోవాలని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఈ గ్రామసభలో వివిధ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాఘవేంద్ర, ఆర్‌ఐ ఏసోబు, వీఆర్‌ఓ మధుసాయికుమార్, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం

వైవీయూ : దువ్వూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన తాళ్లమాపురం నాగేంద్ర ప్రసాద్‌కు తిరుపతి వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రసాయన శాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. ఐఐసీటీ పూర్వపు సంచాలకులు డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్, కో సూపర్ వైజర్ ఆచార్య సి.సురేష్ రెడ్డి పర్యవేక్షణలో 'డెవలప్‌మెంట్ ఆఫ్ సింథటిక్ స్ట్రాటజీస్ టువర్డ్స్ స్పైరోస్పైక్లిన్/ఫ్యూజ్డ్ అజా–హెటిరోస్పైకిల్స్ అండ్ లూపియాల్ డిరివేటివ్స్' అంశంపై ఆయన చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఎస్వీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎం. దామ్లానాయక్ తెలిపారు.

జాగ్రత్తలు పాటించి క్యాన్సర్‌కు దూరం కావాలి



వేంపల్లె : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



తొండూరు : ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది



జమ్మలమడుగు : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కమలాపురం : మద్యం సేవించడం, పొగాకు, గుట్కా నమలడం లాంటి చర్యల ద్వారా క్యాన్సర్ వస్తుందని, జాగ్రత్తలు పాటించి క్యాన్సర్‌కు దూరం కావాలని ప్రముఖ అంకాలజిస్ట్ గిరీష్ (యుకే) తెలిపారు. గురువారం స్థానిక సీఎస్ఎస్‌ఆర్ అండ్ ఎస్‌ఆర్‌ఆర్‌ఎం డిగ్రీ , పీజీ కళాశాలలో నిర్వహించిన క్యాన్సర్ వ్యాధి– నివారణ చర్యలుపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యాయామం, శారీరక శ్రమ బొత్తిగా లేక పోవడం, అధిక బరువు, ఊబకాయం కలిగి ఉండటం, రక్తంలో చెక్కర స్థాయిలు అధికంగా ఉండటం, ఉప్పు అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం, పండ్లు, పాలను తగినంత తీసుకోక పోవడం, మద్యం సేవించడం, పొగాకు, గుట్కా నమలడం తదితర వాటి వలన క్యాన్సర్ వస్తుందన్నారు. బోన్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గొంతు క్యాన్సర్, కడుపు క్యాన్సర్ తదితర రకాల క్యాన్సర్‌లు ఉన్నాయన్నారు. వాటి నివారణకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారాలు తీసుకుంటే క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. తృణ ధాన్యాలు, చిక్కుళ్లు, ఊక వంటి అధిక ఫైబర్ రిచ్ ఆహారాలు కొలెరెక్టల్ క్యాన్సర్‌ను నివారిస్తాయన్నారు. ప్రిన్సిపల్, అధ్యాపకులు మాట్లాడారు.విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ర్యాలీ

వేంపల్లె : మండలంలోని ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీలో గురువారం క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–2 ఆధ్వరలో విద్యార్థులు క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చందన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో క్యాన్సర్ కణాలు ఉంటాయని, శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గినప్పుడు క్యాన్సర్ కణాలు బలహీనపడి క్యాన్సర్ వ్యాధి ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందన్నారు. క్యాన్సర్ రాకుండా ఉండేందుకు సమతుల్య ఆహారం తీసుకోవాలని, బయటి ఆహారం తీసుకోకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు రత్నకుమారి, తిరుపతి రెడ్డి, కో ఆర్డినేటర్ దీప్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి

క్యాన్సర్ వ్యాధిపట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండి సకాలంలో చికిత్సలు పొందాలని పీహెచ్‌సీ డాక్టర్ స్వాతిసాయి తెలిపారు. గురువారం తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ ఉంటే ప్రతి కణం విభజనకు గురై కణాలు పుడుతూ, చనిపోతుంటాయన్నారు. ఎక్కువ సార్లు కాగిన నూనెను వాడకూడదని, ధూమపానం , మద్యపానంకు దూరంగా ఉండాలని, ఎక్కువగా పండ్లు తినాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు నిజాముద్దీన్, పృథ్వీ, సిహెచ్‌ఓ వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషా, ఎంపిహెచ్‌ఇఓ ఫకృద్దీన్, సూపర్ వైజర్ వెంకటలక్ష్మి, సిహెచ్‌ఓ, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ

తొండూరు : మండలంలోని సంతకొవ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయక్ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో ఇంటింటికి తిరిగి 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ చేసి రోగులకు వైద్య సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావన్‌కుమార్‌రెడ్డి. మండల సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

జమ్మలమడుగు : ప్రజలు క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన పెంచుకోవాలని డాక్టర్ తాహీర షమ్మనాజ్ తెలిపారు. గురువారం కన్నెలూరు, నాగులకట్ట అర్బన్ హెల్త్ సెంటర్‌ల ఆధ్వర్యంలో ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అర్బన్‌హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రజలకు ఇంటి వద్దకే వచ్చి పరీక్షలను నిర్వహిస్తారన్నారు.

క్యాన్సర్‌పై ర్యాలీ

ఎర్రగుంట్ల : మండలంలోని చిలంకూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారులు సాయిచరితరెడ్డి, గణేష్ కుమార్‌రెడ్డిలు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ముందుస్తు క్యాన్సర్ నివారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి, సూపర్‌వైజర్ సుభద్రలు, ఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతికత వినియోగంతో ఉత్తమ పరిశోధనలు

వైవీయూ: సాంకేతికత వినియోగంతో ఉత్తమ పరిశోధనలు అందుబాటులోకి వస్తాయని వైవీయూ సహ ఆచార్యులు డా.వి.రామకృష్ణ అన్నారు. డీబీటీ స్టార్ స్టేటస్‌లో భాగంగా కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్ రంగాల్లో పరిశోధనలకు సాంకేతికత ఉపయోగపడుతుందన్నారు. డీబీటీ కోఆర్డినేటర్ డా. వై. సావిత్రి మాట్లాడుతూ పరిశోధనలు మానవుల సమస్యలకు పరిష్కారం చూపగలవన్నారు. జంతుశాస్త్ర విభాగాధిపతి డా.పి.రవిశేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అనుభవజ్ఞుల మార్గదర్శనంలో లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. అనంతరం అతిథిని ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ డా.ఎం.రమేష్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు.పీ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.